పట్టాలు తప్పిన రైలు

- విజయనగరం గూడ్స్‌షెడ్ సమీపంలో ఘటన
- నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులు క్షేమం
- ఆరా తీసిన ఎంపీ కలిశెట్టి



పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్ బోగీల వద్ద పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి సంబల్‌పూర్‌కు వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెంబరు 20810) రైలు విజయనగరం రైల్వేస్టేషన్ దగ్గరలో రైల్వే గూడ్స్‌షెడ్ వద్ద బుధవారం పట్టాలు తప్పింది. ఆ సమయంలో భారీగా కుదుపు రావడంతో ప్రయాణికులు హడలిపోయారు. కొందరు భయంతో కేకలు వేశారు. రైల్వే డ్రైవర్, గార్డ్ అప్రమత్తంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. రెండు బోగీలు పట్టాలు తప్పిన వెంటనే రైలును నిలిపివేశారు. ఉదయం 11.50 ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. అనంతరం రైల్వే అధికారులు వచ్చి పట్టాలు తప్పిన బోగీలను పూర్తిగా పక్కకు తప్పించే పనులు చేపట్టారు. రైల్వే డీఆర్ఎం లలిత్ బోరా ఘటనపై తొలుత ఆరా తీశారు. సాయంత్రం 4.30 గంటలకు విజయనగరం చేరుకున్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో రెండు బోగీలు మినహా తిరిగి రైలు సంబల్‌పూర్ బయలుదేరింది. విశాఖ నుంచి రైల్వే సాంకేతిక నిపుణులు వచ్చి ట్రాక్‌ను, పక్కకు తప్పించిన రైలు బోగీలను పరిశీలించారు. పట్టాలు తప్పడానికి గల సాంకేతిక కారణాలను తెలుసుకుంటున్నారు.

- ఘటనపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరా తీశారు. రైల్వే డీఆర్ఎం లలిత్‌బోరాతో ఫోన్లో మాట్లాడి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం తీరును తెలుసుకున్నారు. రైల్వే అధికారులతోనూ మాట్లాడారు.

పట్టాల నుంచి పక్కకు వచ్చేసిన బోగి





బడికి రండి బహుమతి తీసుకోండి

- విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయాలనుకుంటున్న ప్రభుత్వం
- పాఠశాలలు తెరిచిన రోజే అందజేత
- పంపిణీ పర్యవేక్షణకు కమిటీలు



రాజాం రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి తెరిచే సమయానికి విద్యార్థులందరికీ వివిధ రకాల వస్తువులతో కూడిన కిట్లును ఉచితంగా అందజేసేందుకు నిర్ణయించింది. డా.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర (ఎస్.ఆర్.కె.వి.ఎం.) పేరుతో కిట్లు పంపిణీ చేసేలా చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం అధికారులతో కూడిన కమిటీలను నియమించేలా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయి కమిటీ సభ్యులు మూడుదశల్లో వీటిని పంపిణీ చేయనున్నారు. కిట్లను సకాలంలో పాఠశాలలకు అందించేందుకు కాంట్రాక్టర్లతో చర్చించి జిల్లాలు, మండలాల్లోని స్టాక్ పాయింట్లకు సరఫరా చేసేలా చూడాలని నిర్దేశించింది. ఆపై మండలస్థాయి స్టాక్ పాయింట్ల నుంచి గ్రామాల్లోని పాఠశాలలకు అందించాలంది. కిట్లలో ఏయే రకాల వస్తువులు ఉంటాయనేది రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయలేదు.

పాఠశాల స్థాయిలో..

విద్యార్థులకు కిట్లు సరఫరాకు సంబంధించి పాఠశాల స్థాయిలో కమిటీలను నియమించ నున్నారు. ప్రధానోపాధ్యాయుడి అధ్యక్షతన ఒక ఉపాధ్యాయుడు, గ్రామ/వార్డు సచివాలయానికి చెందిన విద్యా (మిగతా 8వ పేజీలో..)

నేటి నుంచి పది మూల్యాంకనం

6

దివ్యాంగుల కోసం యూడీఐడీ



లోట్టపల్లి సంతలో ఎండలోనే పశువులు

కూసంత కరుణ లేదా?

- లోట్లపల్లి సంతపై అధికారుల నిర్లక్ష్యం
- అనుమతి లేకపోయినా పట్టించుకోని వైనం
- కబేళాకు తరలిపోతున్న మూగజీవాలు
- రవాణాలో కనీస సౌకర్యాలు మృగ్యం
- సంత నిర్వాహకునికి నేతల సహకారం
- గత ప్రభుత్వం నుంచీ ఇదే తీరు
- వారం.. వారం రూ.కోట్లలో వ్యాపారం



జామి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి)

ఆ సంతకు అధికారుల నుంచి అనుమతి ఉందా..? నిర్వాహకుడు నిబంధనలు అనుసరిస్తున్నాడా..? అధికారులు నిఘా పెట్టారా..? క్రమం తప్పకుండా సంత నిర్వహణ కమిటీ సమావేశం అవుతోందా..? పశువులకు కనీస వసతులు కల్పిస్తున్నారా..? వాటి రవాణాలో జాగ్రత్తలు తీసుకుంటున్నారా..? ఈ ప్రశ్నలన్నింటికీ లేదనే సమాధానమే వినిపిస్తోంది. జామి మండలంలోని లోట్లపల్లి సంత పరిస్థితి ఇది. పూర్వం నుంచి అతిపెద్ద పశువుల మార్కెట్‌గా పేరొందింది. ప్రతి సోమవారం జరిగే ఈ సంతకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే ఏ విషయంలోనూ సంతలో నిబంధనలు అమలు కావడం లేదు. అసలు సంత నిర్వహణకు అనుమతే లేదు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వ నేతలతోనూ సఖ్యతగా ఉంటూ నిర్వాహకుడు ఇష్టారాజ్యంగా వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జామి మండలంలోని లోట్లపల్లి పశువుల సంత జిల్లాలోనే కాకుండా పక్క రాష్ట్రం పశువుల వ్యాపారులకు కూడా బాగా తెలుసు. సులువుగా వ్యాపారం సాగించాలన్నా... పశువులను ఏ రకంగా పట్టుకుపోవాలన్నా.. ఈ సంతే అనుకూలమని వ్యాపారులు భావిస్తారు. ఇటీవల కాలంలో కబేళా కోసమే ఎక్కువ ఆవులు అమ్ముడుపోతున్నాయి. అయితే వాటిని తీసుకువచ్చేటప్పుడు కాని తరలించేటప్పుడు కాని కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఒక్కోసారి కుక్కినట్టుగా ఒక వాహనంలో అత్యధికంగా ఆవులను రవాణా చేస్తున్నారు. పట్టించుకునేవారు ఉండరని వ్యాపారులకు గట్టి నమ్మకం. సంత నిర్వాహకుడు కూడా వారికి భరోసా ఇస్తున్నట్లు సమాచారం. అంతకన్న ముఖ్యంగా ఏడాది కాలంగా ఈసంత నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవు. అధికారులు ఎందుకు అడగడం లేదో వారికే తెలియాలి. నిర్వాహకునికి కొందరు అధికారుల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. కోట్ల రూపాయల్లో జరిగే లావాదేవీల్లో వారికీ వాటా అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతినిధులు ఈ సంత నిర్వాహకునికి అండగా ఉండేవారు. వారి సహకారంతోనే పశువుల వ్యాపారం బాగా సాగేది. దీనిపై జంతు సంరక్షణ సమాఖ్య అప్పట్లో గగ్గోలు పెట్టింది. కొందరు అధికారులు నిర్వాహకుడికి సహకరిస్తున్నారని సమాఖ్య ప్రతినిధులు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోయింది. ఇదిలా ఉండగా ఎన్నికలకు కొద్దిరోజుల ముందు సంత నిర్వాహకుడు కండువా మార్చేశాడు. ఇంకేముంది కండువా మార్చిన పార్టీ గెలిచింది కాబట్టి మళ్లీ (మిగతా 8వ పేజీలో..)

కీలక పరిణామం

- మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి నోటీసు
- కలెక్టర్‌కు అందజేసిన టీడీపీ కౌన్సిలర్లు



కలెక్టర్‌కు నోటీసు అందజేస్తున్న టీడీపీ బొబ్బిలి కౌన్సిలర్లు

బొబ్బిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ వెంకటమురళీకృష్ణారావు(వైసీపీ)పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే దిశగా బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీ బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు, 8వ వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు, మున్సిపల్ టీడీపీ ఫ్లోర్‌లీడరు, ఆరోవార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు, మూడో వార్డు కౌన్సిలర్ బొత్స సురేష్‌కుమార్‌లు కలిసి కలెక్టర్ అంబేడ్కర్‌కు నోటీసు అందజేశారు. దీంతో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ఖాయమని తేలిపోయింది.

బొబ్బిలి మున్సిపాలిటీలో మొత్తం 31 వార్డులు ఉండగా, అందులో 21 వ వార్డుకౌన్సిలరు మరిశర్ల రామారావు వైసీపీ నుంచి గెలుపొంది, ఆ పార్టీని, కౌన్సిలర్ పదవిని వీడి గత ఏడాది బీజేపీలో చేరిపోయారు. ఆ వార్డుకు ప్రస్తుతం కౌన్సిలర్ ఎవరూ లేరు. మిగిలిన 30 వార్డులలో 20 వైసీపీ, 10 టీడీపీ ఖాతాలో ఉన్నాయి. వైసీపీలో ఉన్న 20 మందిలో నుంచి 10 మంది చైర్మన్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు వైసీపీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు తొలుత ముందుకు వచ్చి సంతకాలు చేశారు. రెండు రోజుల ముందు 26వ వార్డు కౌన్సిలరు మరిపి తిరుపతిరావు కూడా తొమ్మిది మంది వైసీపీ కౌన్సిలర్ల చెంత చేరిపోయారు. ఇది తెలుగుదేశం పార్టీకి బాగా సానుకూలమైంది. మొత్తం 20 మంది కౌన్సిలర్ల బలం, ఒక ఎక్స్ అఫీషియోసభ్యుని (ఎమ్మెల్యే) ఓటు టీడీపీ ఖాతాలో చేరినట్టయింది. చైర్మన్‌పై అసమ్మతిని బహిరంగంగా వ్యక్తపరిచిన 10 మంది వైసీపీ (మిగతా 8వ పేజీలో..)



సదరం ధ్రువపత్రాలకు గ్రీన్‌సిగ్నల్

- దివ్యాంగుల్లో అర్హులకు మంజూరు చేసే యోచనలో ప్రభుత్వం
- రేపటి నుంచి స్లాట్ల బుకింగ్ పునరుద్ధరణ



మెంటాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సదరం స్లాట్ల బుకింగ్‌ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం దివ్యాంగ పెన్షన్లు పొందుతున్న వారిలో అనర్హుల గుర్తించేందుకు జరుగుతున్న వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగిస్తూనే, వికలాంగ సంఘాల విజ్ఞప్తి మేరకు కొత్త పింఛన్లపై తాజాగా నిర్ణయం తీసుకుంది. తద్వారా దివ్యాంగుల్లో అర్హులకు త్వరలో పింఛన్లు మంజూరు చేయనున్నట్టు సమాచారం.

రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల పెన్షన్లు పొందుతున్న వారిలో అనర్హులు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించిన ప్రభుత్వం లబ్ధిదారులు సమర్పించిన సదరం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను (మిగతా 8వ పేజీలో..)

కేసుల పురోగతిని నిక్షిప్తం చేయాలి: ఐజీ


విజయనగరం క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌లలో నమోదవుతున్న కేసుల్లో దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్)లో నిక్షిప్తం చేయాలని ఐజీ(పర్సనల్స్) ఎస్.హరికృష్ణ ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న గంజాయి, మిస్సింగ్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, మహిళా బాధిత, గ్రేవ్ అండ్ నాన్‌గ్రేవ్ కేసులపై బుధవారం పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో అన్ని కేసుల సమాచారాన్ని సీసీటీఎన్ఎస్ ద్వారా తీసుకుని సమీక్షిస్తామన్నారు. ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు దీని పట్ల సంపూర్ణ అవగాహన కలిగి వుండాలన్నారు. వినియోగించడంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఇబ్బందులు (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న ఐజీ హరికృష్ణ

దివ్యాంగుల కోసం యూడీఐడీ

- ఆధార్ తరహాలో గుర్తింపు కార్డు
- ఆన్‌లైన్‌లో సులువుగా పొందే అవకాశం
- ఇంటి నుంచే రైల్వే పాసులు...



రాజాం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు మేలు చేసే కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో సంక్షేమ పథకాలు, రాయితీలు, ఇతరత్రా సౌకర్యాలు పొందేందుకు యూనిక్ డిజేబులిటీ ఐడెంటిటీ (యూడీ ఐడీ) కార్డులను అందుబాటులోకి తీసుకు వస్తున్నాయి. ఈ యూడీఐడీ పోర్టల్, కార్డులు దివ్యాంగులకు వరంగా మారనున్నాయి. ఈ పోర్టల్ ద్వారా పొందిన ఐడీ నంబర్ ఆధారంగా దివ్యాంగులు రైల్వేపాసులు కూడా పొందవచ్చు. గతంలో సదరం సర్టిఫికెట్లు పొందాలంటే ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి వచ్చేది. మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇకపై యూడీఐడీ ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. దివ్యాంగులకు సంబంధించి 21 రకాల సేవలు పొందవచ్చు.

● తగ్గనున్న వ్యయప్రయాసలు..

మరోవైపు దివ్యాంగులు రైల్వే పాసులు పొందేందుకు రైల్వేశాఖ ఆన్‌లైన్‌లోనే అవకాశం కల్పించింది. గతంలో మాదిరిగా రైల్వేస్టేషన్ల చుట్టూ తిరగకుండానే ఇంటి వద్ద నుంచే రైల్వే పాసులు పొందే వెసులుబాటు కల్పించింది. ఇంటర్‌నెట్ కేంద్రంలో కానీ.. మీ సేవా కేంద్రాలకు వెళ్లి కానీ పాసులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని పొందవచ్చు. సొంత కంప్యూటర్ ఉన్నవారు ఇంటి నుంచే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. http:///divyangjanid.indianrail.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులోనే యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డు (యూడీఐడీ) మంజూరు చేస్తారు. కొత్త పాసులు కావాల్సిన వారు, పాతవి రెన్యూవల్ చేయాలనుకునే వారు ఇందులో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే ఈ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. దివ్యాంగులు ఓటీపీ ఆధారంగా ఆన్‌లైన్‌లోనే పాసు, ఐడీ కార్డు తీసుకోవచ్చు. కొత్తగా దరఖాస్తు చేసుకునే సమయంలో తొలుత తన పేరు, ఆధార్ కార్డు నంబరు, ఫోన్ నంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయిన తరువాత ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలి. తరువాత వచ్చిన ఓటీపీ నంబర్‌ను ఎంటర్ చేసి లాగిన్ కావాలి. ఎన్ని సార్లు లాగిన్ అయినా పేర్లు రిజిస్టర్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఉమ్మడి జిల్లాలో 6 వేల మంది దివ్యాంగులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో కొద్ది మంది మాత్రమే రైల్వేపాసులు ఉపయోగించు కుంటున్నారు. ఎక్కువ మంది ఉపయోగించుకోలేక పోతున్నారు. జిల్లాకు సంబంధించి విజయనగరంలో మాత్రమే రైల్వేపాసుల జారీ కేంద్రం ఉంది. సుదూర ప్రాంతాల వారు ఏటా రైల్వేపాసుల కోసం వెళ్లడం కష్టతరంగా ఉంటోంది. పైగా కొన్నిస్టేషన్లలో ప్లాట్‌ఫారాలు దాటుకొని వెళ్లడం ఇబ్బందిగా ఉంటోంది. అందుకే ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఈ నిర్ణయం తీసుకుంది.

శుభ పరిణామం..

ఆన్‌లైన్‌లో రైల్వే పాసులు అందిస్తుండడం శుభపరిణామం. గతంలో వ్యయప్రయాసలకు గురయ్యేవారం. సుదూర ప్రాంతాలకు వెళ్లి పాసులు తీసుకోవడానికి చాలామంది విముఖత చూపేవారు. రైల్వేశాఖ స్పందించి ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో పాసులు పొందే వెసులుబాటు కల్పించడం బాగుంది. రైల్వేశాఖకు కృతజ్ఞతలు.

-పి.గణేష్, దివ్యాంగుడు, రాజాం

మంచి నిర్ణయం..

రైల్వేశాఖ మంచి నిర్ణయం తీసుకుంది. గతంలో పెద్దస్టేషన్లలో పాసుకు సంబంధించి కౌంటర్లు ఏర్పాటు చేసేవారు. అప్పట్లో రకరకాల సాంకేతిక సమస్యలు వచ్చేవి. దీంతో పాసులు పొందేందుకు ఇబ్బందులు పడేవారం. మా ఇబ్బందులు గమనించిన రైల్వేశాఖ ఆన్‌లైన్ జారీ ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం బాగుంది.

-దుర్గారావు, దివ్యాంగుడు, రాజాం

జేఎన్‌టీయూలో కొత్త కోర్సులు

- వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



విజయనగరం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఏకైక ప్రభుత్వ యూనివర్సిటీగా ఉన్న జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యా లయంలో రానున్న ఏడాదిలో మరిన్ని కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న వాటికి అవి అదనం. ఇంజినీరింగ్ విద్యలో కాలానికి అనుగుణంగా మార్పులు తీసుకువచ్చి, ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా వర్సిటీ ముందుకెళు తోంది. ఈ యూనివర్సిటీతో పాటు, అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా వివిధ కంపెనీలతో జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ భవిష్యత్తు కార్యక్రమాలు... ప్రస్తుతం అందిస్తున్న కోర్సులు తదితర అంశాలపై వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ప్రశ్న: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో కొత్తకోర్సులు వచ్చే అవకాశం ఉందా?

జవాబు: ఉంది. ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఈ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులతో పాటు, ఎంబీఏ, ఎంసీఏ వంటివి ఉన్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫార్మసీ కోర్సుల ఏర్పాటుకు ఉన్నత విద్యామండలికి ప్రతిపాదనలు పంపాం. సానుకూలంగా స్పందించింది. త్వరలో దీనిపై విద్యామండలి నుంచి అనుమతులు వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే వీటిని అందుబాటులోకి తెస్తాం.

ప్ర: ఇంజనీరింగ్ విద్యకు సంబంధించి కొత్త కోర్సులు ప్రారంభించే చర్యలు ఏమైనా చేపట్టారా?

జ: చర్యలు చేపట్టాం. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సివిల్, మెకానికల్, మెటాలజికల్, ఈసీఈ, ఈఈఈ, సీఎస్ఈ ఇలా అన్ని కోర్సులు జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్నాయి. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఒకటి, రెండు కొత్త కోర్సులు ప్రవేశపెట్టడానికి విద్యా మండలికి ప్రతిపాదనలు పంపాం. వాటికి ఆమోదం లభించిన వెంటనే ఇంజనీరింగ్ విద్యలో కూడా కొత్తకోర్సులు ప్రవేశపెడతాం.

ప్ర: యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న ఆడిటోరియం, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఇతర నిర్మాణాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?

జ: వీటి విషయాన్ని ఉన్నత విద్యామండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయానికి కేటాయింపులు చేస్తే, ఈ భవనాల నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయి. రానున్న రెండేళ్లలోపే ఈ భవనాలన్నీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ప్ర: ఇంజనీరింగ్ విద్యలో ప్రస్తుతం ఉన్న కోర్సుల్లో వేటికి ప్రాధాన్యం ఉంది? ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎలా ఉంటున్నాయి?

జ: ఇంజనీరింగ్ విద్యలో ప్రస్తుతం ఉన్న కోర్సుల్లో వేటికవే ప్రాధాన్యం ఉన్నవి. అన్ని విభాగాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కాకపోతే, విద్యార్థుల ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. అధ్యాపకులు, విద్యార్థులు నిత్యం కొత్త విషయాలు తెలుసుకోవాలి. వారు చదువుతున్న ఇంజనీరింగ్ కోర్సుల్లో మార్పులు గ్రహించాలి. వాటికి అనుగుణంగా ముందుకు సాగాలి.

ప్ర: మార్పులు గ్రహించడం ఎలా? ఇందుకు యూనివర్సిటీలో ఏమైనా కార్యక్రమాలు జరుగుతున్నాయా?

జ: జరుగుతున్నాయి. ఇంజనీరింగ్ విద్యలో ప్రస్తుతం ఉన్న కోర్సులకు సంబంధించి విశ్వవిద్యాలయంలో నెలలో మూడుకు తగ్గకుండా వర్క్‌షాపులు, సెమినార్‌లు నిర్వహిస్తూ వస్తున్నాం. ఒక్కొక్కసారి ఒక్కొక్క విభాగానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్నాం. ఆ రంగంలో నిష్ణాతులైన వారిని తీసుకువచ్చి అటు అధ్యాపకులు, ఇటు విద్యార్థులకు మార్పుల విషయంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారు ఉద్యోగం కోసం అదనంగా కోర్సులు చదవాల్సి వస్తోంది. దీనికి మీ స్పందన ఏంటి?

జ: ప్రస్తుతం చదవాల్సి వస్తున్న మాట నిజమే. దీనిపై ఉన్నత విద్యామండలి ఒక నిర్ణయం తీసుకుంది. జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంతో పాటు, అనుబంధ కళాశాలల్లో సర్టిఫికెట్ కోర్సులను కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించే ప్రతిపాదనలు ఉన్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ విద్య ముగిసేలోప డిమాండ్ ఉన్న సర్టిఫికెట్ కోర్సులను కూడా విద్యార్థులకు నిపుణుల శిక్షణలో అందించనున్నాం.

ప్ర: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం, వాటి అనుబంధ కళాశాలల్లో విద్యను పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఏవిధంగా ఉన్నాయి?

జ: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంతో పాటు, వాటి అనుబంధ కళాశాలల్లో ఏడాదికి రెండు నుంచి మూడు పర్యాయాలు క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఇందులో కొంతమందికి అవకాశాలు వస్తున్నాయి. క్యాంపస్ ఇంటర్వ్యూలు ఇంకా ఎక్కువగా జరిగే విధంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరింత కృషి చేస్తాం.



వంశధార నది దాటి వస్తున్న ఏనుగులు

తిరిగొచ్చేశాయ్!

- ఒడిశా నుంచి బిల్లుమడకు వచ్చిన ఏనుగులు

భామిని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏవోబీ సరిహద్దు వంశధార నది దాటి మంగళవారం ఒడిశా వైపు వెళ్లిన నాలుగు గజరాజులు తిరిగి భామిని మండలానికి చేరుకున్నాయి. బుధవారం అవి బిల్లుమడలో దర్శన మిచ్చాయి. ప్రస్తుతం అవి ఆ గ్రామ పొలాల్లో సంచరిస్తున్నాయి. దీంతో రైతులు, ప్రజలు అటువైపు వెళ్లేందుకు సాహసించలేకపోతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. గజరాజుల కారణంగా తమ పంటలు ధ్వంసమవు తున్నాయని మరోవైపు రైతులు లబోదిబోమంటున్నారు. మరోవైపు ఫారెస్ట్ అధికారులు ఏనుగులను పర్య వేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నదీతీరానికి ఎవరూ వెళ్లరాదని గ్రామాల్లో దండోరా వేసి అవగాహన కల్పిస్తున్నారు.



బిల్లుమడ తోటల్లో నాలుగు ఏనుగుల గుంపు

భలేగుంది 'ఈ'- బైకు!



పార్వతీపురానికి చెందిన గెంబలి గౌతమ్ తయారు చేసిన ఎలక్ట్రిక్ వాహనాన్ని బుధవారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. చూడముచ్చటగా ఉన్న ఆ బైక్‌ను ఎలా తయారు చేశారు? వ్యయమెంత? దీని తయారీకి ఎన్ని రోజులు పట్టింది? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యువకుడిని వెనుక కూర్చోబెట్టుకుని ఆ వాహనం నడిపారు.

-పార్వతీపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి)



రహదారి కుంగుతోంది!

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

బొండపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారి నెం.26 రోజురోజుకూ కుంగిపోతోంది. మండలంలోని అంబటివలస నుంచి విజయనగరం వైపు వెళ్లే వైపు కిలోమీటరు మేర హైవే ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. పలుచోట్ల రోడ్డు కుంగిపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు రహదారికి మరమ్మతులు చేపట్టినప్పటికీ మార్పు కానరావడం లేదు. భారీ మలుపులు, వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డులో కుంగిపోయిన చోట తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు హఠాత్తుగా బ్రేకులు వేయడం వల్ల అదుపు తప్పి రోడ్డుకు ఆనుకుని ఉన్న నివాసాలపైకి వాహనాలు దూసుకుపోతున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి...రహదారికి మరమ్మతులు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



కుంగిపోయిన రోడ్డు

ఆర్ అండ్ బీ దృష్టికి తీసుకువెళ్లాం..

ప్రమాదాలను అరికట్టేందుకు ప్రధాన స్థలాల్లో వేగ నియంత్రణకు ఎనిమిది స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశాం. ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఆయన సూచన మేరకు బ్లాక్ స్పాట్‌లలో 16 లైట్లు, 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడాం. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించాం.

-జి.ఎ.వి.రమణ, సీఐ, గజపతినగరం

నేటి నుంచి పది మూల్యాంకనం

- వారం రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యం
- 1,200 మంది ఉపాధ్యాయుల నియామకం



రాజాం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఏడు రోజుల్లో పూర్తిచేసేలా పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 3 నుంచి 9లోగా మూల్యాంకనం పూర్తిచేసేలా షెడ్యూల్‌ను ప్రకటించింది. జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు సారథ్యంలో జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో వాల్యుయేషన్‌కు ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. ఇందుకోసం 1,200 మంది ఉపాధ్యాయులను నియమించారు. వీరంతా సంబంధిత కేంద్రంలో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు జవాబుపత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. ఈసారి త్వరగా ఫలితాలు వెల్లడించాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అన్నీ అనుకూలిస్తే ఈ నెలాఖరులోగా ఫలితాలు వెల్లడించే అవకాశాలు లేకపోలేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

● 30 నుంచి 40 పేపర్లు..

గతానికి భిన్నంగా ఫలితాలు ముందుగా ఇవ్వాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. పది పరీక్షలు రాసి మెరుగైన ఫలితాలు వస్తాయన్న విద్యార్థులకు ఈ నెల 7 నుంచి హాల్‌టికెట్ ఆధారంగా ఇంటర్‌లో ప్రవేశించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇంటర్ విద్యలో సమూల మార్పులు తీసుకు వస్తోంది. ఇంటర్‌లో పనిదినాల సంఖ్యను పెంచేలా సర్దుబాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో పది మూల్యాంకనాన్ని ముందుగా ప్రారంభించేలా చర్యలకు శ్రీకారం చుట్టింది. ఒక్కో ఉపాధ్యాయుడికి తొలుత 30 నుంచి 40 జవాబు పత్రాలు ఇస్తారు. వారు నిర్ణీత వ్యవధిలో దిద్దితే.. మరో పది పేపర్లు ఇస్తారు. జిల్లాకు వచ్చిన పేపర్ల సంఖ్యను బట్టి ఉపాధ్యాయుడికి ఇచ్చే జవాబుపత్రాల సంఖ్య అటూ ఇటూ మారే అవకాశాలు ఉన్నాయి.

పకడ్బందీగా..

పది మూల్యాంకనాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇందుకోసం 1200 మంది ఉపాధ్యాయులను నియమించాం. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో మూల్యాంకనం జరగనుంది. 101 మంది సి.ఇ.లు, 615 మంది ఏఈలు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించాం. సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాం.

-మాణిక్యం నాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం

ఉద్యాన పంటల సాగుకు ప్రణాళిక

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు 15 రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఉద్యాన పంటల సాగు, సూక్ష్మ సేద్యంపై తన కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార పంటలకే కాకుండా ఉద్యాన పంటల సాగుకు కూడా అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో మామిడి విస్తీర్ణం సాగు పెంచాలని ఆదేశించారు. ఈ ఏడాది అదనంగా 1000 హెక్టార్లలో ఆయిల్ పామ్ తోటలు వేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

మరుపల్లి పీహెచ్‌సీలో అన్నీ సమస్యలే

జిన్నాం కోలొకేటెడ్ పీహెచ్‌సీ కూడా ఇక్కడే..
అరకొర సిబ్బందితో అందని సేవలు
భవనం మంజూరు చేస్తే రోగులకు మేలు

గజపతినగరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టిమిట్టాడుతోంది. మండలంలో ఏకైక పీహెచ్‌సీ ఇదే. మండలంలోని 63,579 మంది జనాభాకు మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే ఆధారం. ఈ నేపథ్యంలోజనాభా ప్రాతిపదికన మరో పీహెచ్‌సీ అవసరమని 2019లో టీడీపీ ప్రభుత్వం గుర్తించి జిన్నాంలో అదనపు పీహెచ్‌సీకి ప్రతిపాదనలు చేసింది. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అదనపు పీహెచ్‌సీని జిన్నాంలో ఏర్పాటు చేయకుండా గజపతినగరంలోని సీహెచ్‌సీలో (కోలొకేటెడ్) ఏర్పాటు చేసింది. ఇందుకుగానూ ఒక గదిని కేటాయించారు. అయితే సీహెచ్‌సీ.. ఏరియా ఆసుపత్రిగా మార్పు చెందడం, అక్కడ సరిగా వసతి లేకపోవడంతో కొలొకేటెట్ పీహెచ్‌సీ వైద్యులు మరుపల్లి పీహెచ్‌సీలోకి మారారు. దీంతో మరుపల్లి పీహెచ్‌సీపై అదనపు భారం పడుతోంది. ప్రస్తుతం మండలంలోని 30 పంచాయతీల పరిధిలోని 63,579 మంది జనాభాకు మరుపల్లి పీహెచ్‌సీ నుంచే సేవలు అందించే పరిస్థితి నెలకొంది. ఇక్కడ మరుపల్లి, జిన్నాం పీహెచ్‌సీలకు చెందిన నలుగురు వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. 104 వాహనంలో సేవలకు రోజుకు ఒక వైద్యుడు ఇక్కడి నుంచి వెళ్లాల్సి ఉంది. ఇక్కడ నలుగురు హెల్త్ అసిస్టెంట్లకు గానూ ఒక్కరే ఉన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు మరుపల్లి, ముచ్చర్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత వల్ల అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది.

మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం..

మరుపల్లి పీహెచ్‌సీకి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లాం. అలాగే జిల్లా అధికారులకూ తెలియజేశాం. కోలొకేటెడ్ అదనంగా మంజూరు చేసినా ఏరియా ఆసుపత్రిలో ఇచ్చిన భవనం చాలక మరుపల్లి పీహెచ్‌సీలోనే నలుగురు వైద్యులం సేవలు అందించాల్సి వస్తుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఇబ్బంది పడుతున్నారు. జిన్నాం పీహెచ్‌సీకి భవనం మంజూరు చేస్తే సమస్య పరిష్కారమవుతుంది.

-సాయికృష్ణారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి, మరుపల్లి



మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిదే..



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏఎస్‌ఐ

ఏఎస్‌ఐకి ఎస్పీ అభినందనలు

నెల్లిమర్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ సతీశ్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం అభినందించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఏఎస్‌ఐ సతీష్ ప్రజలతో సత్సంబందాలు కలిగి ఉండటంతో పాటు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచిపేరు తీసుకువస్తున్నందుకు ఎస్పీ అభినందిస్తూ ప్రశంసాపత్రం అందజేశారు.

ఎంపీడీవోగా తులసీనాథ్

బొండపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బొండపల్లి ఎంపీడీవోగా కె.తులసీనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎంపీడీవోగా పనిచేసిన జి.గిరిబాల రెండు నెలలపాటు సెలవు పెట్టడంతో కార్యాలయం సూపరింటెండెంట్ తులసీనాథ్‌కు ఎంపీడీవోగా బాధ్యతలను జడ్పీ సీఈవో అప్పగించారు.

ఏపీవోగా కృష్ణవేణి

గజపతినగరం ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హమీ పథకం ఏపీవోగా కృష్ణవేణి నియమితులయ్యారు. ఇక్కడి ఏపీవో సీహెచ్.రామారావుకు నెలిమర్ల బదిలీ అయింది. బొండపల్లి ఏపీవో గజపతినగరానికి బదిలీపై రానున్నారు.

దుకాణాలకు వేలం పాట రేపు

కొత్తవలస, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని 26 దుకాణాలను ఏడాది కాలానికి అద్దెకు ఇచ్చేందుకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఈవో శైలజ తెలిపారు. బుధవారం ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు. కొత్తవలస మేజర్ పంచాయతీకి సంబంధించి 3 బ్లాక్‌ల్లో 20 దుకాణాలు ఉన్నాయన్నారు. ఇవికాకుండా మరో దుకాణాలు ఉన్నాయని, వాటన్నింటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దెకు ఇవ్వనున్నామన్నారు. మూడు బ్లాక్‌ల్లో 20 దుకాణాల కోసం వేలం పాటలో పాల్గొనే వారు రూ.లక్ష, 6 దుకాణాల కోసం రూ.30 వేలు చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. వేలం పాట ఈవోపీఆర్డీ శ్రీదేవి, సర్పంచ్ మచ్చ రామస్వామి సమక్షంలో జరుగుతుందన్నారు.

5న గురు సత్కారం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఈ నెల 5న సాయంత్రం గురుసత్కారం జరుగుతుందని ద్వారం దుర్గాప్రసాదరావు శిష్య సమాఖ్య ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, రామదాస రాంబాబు, మందా సుధారాణి, కట్టమూరి చంద్రశేఖరం, ఏవీఎల్ఎన్ శాస్త్రి, చాగంటి కొండలరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

చీపురుపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం చీపురుపల్లి, మెరకముడిదాం మండలాలకు చెందిన బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ శిబిరానికి ఆర్డీవో సత్యవాణి హాజరై మాట్లాడారు. ఎన్నికల అంశాలకు సంబంధించిన ప్రతి విషయంలోనూ బీఎల్వోలకు అవగాహన అవసరమన్నారు. శిక్షణలో తహసీల్దార్లు ఎన్.రాజారావు, అజురఫీజాన్, డీటీ ఎం.హర్షవర్ధిని పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రసాద్

విజయనగరం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధ్యతలను స్వీకరించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ను టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబు, మాజీ కౌన్సిలర్లు ముద్దాడ చంద్రశేఖర్, కిల్లాన మహేశ్వరరావు, కోంద్రు శ్రీనివాసరావు, నాయకులు ఈగల సత్యారావు, పడాల రామకృష్ణ, నమ్మి చిట్టిబాబు, జోగ చంటి, ప్రసాదుల సుధీర్, పిట్టా శ్రీను తదితరులు అభినందించారు.

ఆహార పదార్థాల తనిఖీ

రాజాం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఎంఆర్ వరలక్ష్మి కేర్ హాస్పిటల్ క్యాంటీన్‌ను జిల్లా ఆహార భద్రతాధికారి పి.వెంకటరమణ బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్లు, అటెండెంట్లకు క్యాంటీన్‌లో తయారు చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. శాంపిళ్లను సేకరించారు.

విద్యార్థి నాయకత్వం దేశాన్ని మారుస్తుంది

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు
సెంచూరియన్ వర్సిటీలో జాతీయ మహిళా విద్యార్థి పార్లమెంట్



విద్యార్థి పార్లమెంట్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ హరిబాబు

పర్లాకిమిడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దేశ నాయకత్వాన్ని మార్చే శక్తి విద్యార్థులకు ఉందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏఐయూ జాతీయ మహిళా విద్యార్థి పార్లమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో తక్కువ శాతం ఉన్న మహిళా విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 50శాతానికి పెరిగిందన్నారు. విద్యార్థుల నాయకత్వం దేశాన్ని మారుస్తుందనేది గతంలో రుజువైందన్నారు. దేశ నాయకత్వంపై విద్యార్థినులు ప్రత్యేక దృష్టి సారించి ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవాలన్నారు. ఏఐయూ కన్వీనర్, ప్రొఫెసర్ సంగ్రామ్‌కేసరి స్వాయ్ స్వాగతం పలుకగా సెంచూరియన్ ఉపకులపతి డాక్టర్ సుప్రియా పట్నాయక్ మహిళలు సాధించాల్సిన లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమానికి 30 విశ్వ విద్యాలయాల నుంచి సుమారు 200 మంది విద్యార్థినులు హాజర య్యారు. కార్యక్రమంలో డాక్టర్ అనితపాత్రో, డాక్టర్ ముక్తికాంతమిశ్రా, ప్రొఫెసర్ డీఎన్ రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సామాజిక-రాజకీయ అంశాలపై చర్చలు జరిగాయి. మూడు రోజుల పాటు వివిధ అంశాలపై చర్చలు, వాదనలు జరగనున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. బుధవారం ఉదయం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామాజిక పెన్షన్, ఇళ్ల కేటాయింపు, రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఆధారంగా ఆయా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నగరంలోని రోడ్లు, కాలువలు, విద్యుత్‌తో పాటు, పార్కుల్లో జిమ్, క్రీడా పరికరాల ఏర్పాటు కోసం వినతులు అందాయని తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసకాలనీలో వివిధ అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భూమిపూజ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి తదితరులున్నారు.

'వక్ఫ్ సవరణ బిల్లు తగదు'

రాజాం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముస్లింల మత స్వేచ్ఛను హరించడంతో పాటు మైనారిటీలను అణచివేయడమే లక్ష్యంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ ఆరోపించారు. బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకురావడాన్ని ఆయన ఖండించారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది ముస్లింలు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నప్పటికీ చట్టసభల్లో బిల్లును ప్రవేశపెట్టడం సరికాదన్నారు. ముస్లింల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు పలుకుతోందని ఆయన స్పష్టం చేశారు.

నూతన ఆవిష్కరణలతో మేలు: డీఈవో

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించి విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చదిద్దేందుకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి శిక్ష (ఈఎండీపీ) ఉపయోగపడుతుందని డీఈవో మాణిక్యం నాయుడు తెలిపారు. విద్యా శాఖ ఆద్వర్యంలో పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రాజెక్టు ఎక్స్‌పో బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా మాణిక్యం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలు వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఈఎండీపీ మేనేజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సాధిద్దాం: మంత్రి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి బాటలో పయనించేందుకు అందరం సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధిద్దామని రాష్ట్రమంత్రి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం బోడసింగిపేటలోని పార్టీ కార్యాలయంలో మంత్రి సమక్షంలో బి.రాజేరు సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ, గొల్లుపాలెంకి చెందిన తొత్తడి సత్తిబాబు, రెండు గ్రామాల నుంచి పలువురు వార్డు సభ్యులతో పాటు 400 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. అందరికీ మంత్రి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, హామీల అమలుపై ఆకర్షితులై పార్టీలోకి రావడం శుభపరిణామమన్నారు. పార్టీలో చేరినవారు ప్రజా సంక్షేమంతో పాటు టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ బొడ్డురావు, సర్పంచ్ మీసాల జానకిరావు, కర్రోతు శ్రీనివాసరావు, నడుపూరు భాస్కరరావు, పాశల సీతారామమూర్తి, రాపాక అచ్చెన్నాయుడు, పీవీవీ గోపాలరాజు, తొత్తడి దేవుడుబాబు, డోకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా..

బొండపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో అందిన ప్రతీ వినతిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బుధవారం బోడసింగిపేటలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గజపతినగరం మండలం తుమ్మికాపల్లి ప్రాథమిక పాఠశాలకు వసతులు కల్పించాలని పాఠశాల కమిటీ అధ్యక్షుడు మండల సూర్యనారాయణ కోరారు. ఇల్లు నిర్మించుకున్నప్పటికీ బిల్లు అందలేదని గజపతినగరానికి చెందిన ఇజ్జురోతు కల్యాణి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పీవీవీ గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, చప్ప చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీలో 50 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోండ్రు

రేగిడి/రాజాం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో వన్నలి గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. బుధవారం రాజాం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు సమక్షంలో వన్నలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమారుడు పాడి అప్పలనాయుడు, వార్డు సభ్యుడు ఎస్.వెంకటరమణ, బెవర కోటేశ్వరరావు, శింగంవలస చంద్రశేఖర్, శింగంవలస లక్ష్మీనారాయణ, ఎస్.వేణు నాయుడుతో పాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, పాలవలస రామచంద్రినాయుడు, పాలూరి రామినాయుడు, ఉంగరాడ సర్పంచ్ చల్ల భజంగరావు, గేదెల బాలమురళీ, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఉషారాణి కండవాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శాసపు గోవిందరావు, అంబళ్ల సత్యం, వి.క్రాంతికుమార్, శాసపు జనార్దనరావు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

రాజాం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని అథోగతి పాల్జేశారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయలో ప్రజాదర్బార్‌తో పాటు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బారులో అందిన వినతుల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కొండవలసకు చెందిన టీడీపీ కార్యకర్త ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందటంతో రూ.5లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

గోస్తనీలోకి వెళ్లకుండా ప్రైవేట్ గేటు



ఇసుక కోసం గోస్తనీలోకి వెళ్లకుండా ఏర్పాటైన గేటు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములాపల్లి గుర్రాజు కల్లాల సమీపంలో ప్రైవేట్ పాఠశాల పక్క నుంచి ఇసుక కోసం గోస్తనీ తీరానికి ఎవరూ వెళ్లకుండా ఓ వ్యక్తి కర్ర గేటు ఏర్పాటు చేశాడు. దానికి తాళం కూడా వేశాడు. గోస్తనీపై కొందరి పెత్తనంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతడికి అధికారుల వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇసుక ఉచితం అని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సదరు వ్యక్తిపై అధికారులు ప్రేమ చూపిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్థిక అవసరాలను గుర్తించండి



మాట్లాడుతున్న ఏజీఎం ఉమామహేశ్వరరావు

చీపురుపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల భవిష్యత్ ఆర్థిక అవసరాలను సక్రమంగా గుర్తించడంలో ఎన్యుమరేటర్లు కీలకంగా వ్యవహరించాలని స్త్రీనిధి ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం ఎన్యుమరేటర్లు, వీవోఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో డ్వాక్రా మహిళలకు ఏ మేరకు రుణాలు అవసరమవుతాయి, తీసుకున్న రుణంతో ఏ రకమైన ఆదాయాభివృద్ధి పనులు నిర్వహిస్తారన్న దానిపై ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎన్.అప్పలనాయుడు, సీసీలు గోవిందరావు, నారాయణమ్మ పాల్గొన్నారు.

● గరివిడి: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు, హెచ్‌హెచ్‌జీ సభ్యులకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికపై బుధవారం శిక్షణ ఇచ్చినట్టు డీపీఎం జి.సీతారామయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం పి.నారాయణరావు, సీసీలు సత్యనారాయణ, ఆదినారాయణ, వీవోఏలు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల : స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు వార్షిక రుణం, జీవనోపాధుల ప్రణాళికలపై బుధవారం వీవోఏలు, ఎన్యుమరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్‌వీడీ సురేష్, ఎఫ్‌పీజీ ఏపీఎం ఎల్.పద్మ, సీసీలు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి కానిస్టేబుల్ మృతి

విజయనగరం క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బొబ్బిలి రామకోటి (37) రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. రామకోటి ఈనెల 1న విశాఖ నుంచి విజయనగరం వస్తున్న సమయంలో కోరుకొండ విజయనగరం రైల్వేస్టేషన్ మధ్య జొన్నవలస సమీపంలో ప్రమాదవశాత్తు జారిపడి పడి తీవ్రగాయాల పాలయ్యారన్నారు. రామకోటి కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారన్నారు. ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి..

రామభద్రపురం,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన కొత్తయ్య పురుగుల మందు తాగి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. జొన్నవలసకు చెందిన పతివాడ కొత్తయ్య తండ్రి సత్యం కొన్నాళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కొత్తయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు సాలూరు సీహెచ్‌సీలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ బుధవారం రాత్రి చికిత్స పొందుతూ కొత్తయ్య మృతి చెందాడని ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులు

డెంకాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదవలస జంక్షన్ చెక్ పోస్ట్ శివార్లలో గంజాయి సేవిస్తున్న యువకులపై బుధవారం డెంకాడ ఎస్‌ఐ సన్యాసినాయుడు, సిబ్బంది దాడులు చేశారు. నలుగురు యువకులను అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, మోటారు సైకిల్, 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలానికి చెందిన ఎర్నాగుల గిరిబాబు, విశాఖపట్నం పెందుర్తి మండలానికి చెందిన బైల పూడి లక్ష్మీనరసింహనాయుడు, ఆనందపురం మండలం నీలకుండీలకు చెందిన షేక్ హాబీబ్ (అబి), అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన గంజి వెంకట్రావు ఉన్నారని డెంకాడ ఎస్‌ఐ సన్యాసినాయుడు తెలిపారు.

మామపై అల్లుడి దాడి

గజపతినగరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతబగ్గాంలో పిల్లను ఇచ్చిన మామపై అల్లుడు దాడి చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. పాతబగ్గాం గ్రామానికి చెందిన సంగంరెడ్డి సత్యం తన కుమార్తెను అదే గ్రామానికి చెందిన కుమిలి ఆదినారాయణకు ఇచ్చి వివాహం జరిపించారు. కొన్నేళ్లుగా భార్యాభర్తల మధ్య తగాదాలు జరుగుతుండటంతో గ్రామపెద్దలు రాజీ చేసేవారు. ఈ నేపథ్యంలో మామ అల్లుడు మధ్య మాటామాటా పెరిగింది. దాంతో కుమిలి ఆదినారాయణతో పాటు కుటుంబ సభ్యులు ఎర్రినాయుడు, అప్పలనాయుడు, సత్యవతి కర్రలతో సత్యంపై దాగి చేశారు. గాయాలపాలైన సంగంరెడ్డి సత్యం పోలీసులకు ఫిర్యాదు చేయడం తో ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. గాయాలపాలైన సత్యం స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

శిలాఫలకాన్ని ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు

దత్తిరాజేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం సంత బ్రిడ్జి వద్ద శిలాఫలకాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం నుంచి రామభద్రపురం వైపు వెళుతున్న కారు పెదమానాపురం సంత బ్రిడ్జి వద్ద ఉన్న శిలాఫలకాన్ని ఢీకొనడంతో కారు ముందు టైర్ పేలింది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న బాడంగి మండలం డొంకినవలసకు చెందిన గండి శంకరరావు, అదే మండలం గజరాయనివలసకు చెందిన మూడడ్ల భాస్కర రావులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు పెట్రోలింగ్ వ్యాన్‌లో గజపతి నగరం పీహెచ్‌సీ తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

రామభద్రపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఓ బాలికను ప్రేమ పేరిట మోసం చేశాడన్న అభియోగంతో నమోదైన కేసులో ఆరికతోటకు చెందిన కనకల రమేష్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.11 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి నాగమణి బుధవారం తీర్పు వెలువరించారని ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు. 2021లో నమోదైన ఈ కేసులో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి తీర్పు వెల్లడించారని చెప్పారు.

ఎలక్ట్రికల్ షాపులో అగ్ని ప్రమాదం

జియ్యమ్మవలస, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినమేరంగి మెయిన్‌రోడ్డు పక్కన శివ సంతోష్ ఎలక్ట్రికల్ షాపులో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి నట్టు భావిస్తున్నారు. షాపులో ఎలక్ట్రికల్ పరికరాలు, టీవీలు కాలిబూడిదయ్యాయి. రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

10 లీటర్ల సారా స్వాధీనం

కురుపాం, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): చినమేరంగికి చెందిన వెలగాడ ప్రభాకరరావు 10 లీటర్ల సారా తరలిస్తూ బుధవారం పట్టుబడ్డారని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. అతడిని అరెస్టు చేసి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) సమస్యలు పరిష్కరించాలంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. మెమో నెంబరు 57 అమలు చేసి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న హోంగార్డులు

గజపతినగరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని గజపతినగరం పోలీస్ స్టేషన్, అగ్నిమాపక కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న హోం గార్డులు తహసీల్దార్ రత్నకుమార్‌ను కోరారు. సీనియర్ హోం గార్డు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌ను వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో హోంగార్డులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. అన్ని మండలాల్లో హోం గార్డులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసినప్పటికీ గజపతినగరంలో చేయలేదన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్. ఎ.నాయుడు, సింహాద్రి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

5న మండల సమావేశం

మెరకముడిదాం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5న ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జి.భాస్కరరావు తెలిపారు. ఎంపీపీ కృష్ణవేణి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామన్నారు.

మరమ్మతులు లేక.. తాగు నీరందక


వద్దువలసలో పాడైన చేతిపంపు

● వద్దువలసలో నిర్వహణ లేక మూలకుచేరిన చేతిపంపు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలోగల వద్దువలస గిరిజన గ్రామ శివారువీధిలో ఉన్న చేతి పంపు మూలకుచేరింది. కొద్ది నెలలుగా మరమ్మతులు చేయాలని గ్రామ సచివాలయంలో పలు సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు వాపోతున్నారు. ఇక్కడి చేతిపంపు చుట్టుపక్కల దాదాపు 15 కుటుంబాలకు నీటి సదుపాయం కల్పిస్తోంది. ఇదే సమయంలో గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం పరిధిలో వీధి కుళాయిలు ద్వారా నీరుసరిగ్గా అందడంలేదని గిరిజనులు చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో చేతిపంపు ములకుచేరడం, కుళాయిల ద్వారా నీరందకపోవడంతో అవస్థలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేతి పంపునకు మరమ్మతు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా క్రాష్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు ప్రారంభించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణకుమార్ తెలిపారు. ఇప్పటికే సిబ్బంది గ్రామల్లో పర్యటిస్తున్నారని, త్వరలో చేతిపంపు మరమ్మతులు చేసి నీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలి

● జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీపీఎం లక్ష్మునాయుడు


మాట్లాడుతున్న లక్ష్మునాయుడు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధికి సంబంధించి వివిధ పథకాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలను ప్రణాళికా బద్ధంగా సాధించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ డీపీఎం జె.లక్ష్మునాయుడు సూచించారు. బుధవారం బొబ్బిలి వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులతో ఏపీఎం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలకు వివిధ బ్యాంకుల ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయించామని, త్వరితగతిన లక్ష్యాలను సాధించాలని కోరారు. వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికల తయారీపై ఎనిమిది సంఘాలకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 223 మందికి వారం రోజులపాటు శిక్షణ తరగతులు వెలుగు ఏపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. సభ్యులు అవసరాలను బట్టి జీవనోపాధుల యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామని సూచించారు.కార్యక్రమంలో మండల సమాఖ్య కార్య దర్శి కునుకు జయలక్ష్మి,సీసీలు, వీవోఏలు,వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో తప్పులను సరిచేయాలి: తహసీల్దార్

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో తప్పులను గుర్తించి సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు వీఆర్వోలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు. రేషన్ కార్డులో పేర్లు ఉన్నవారు ఈకేవైసి చేయించుకునేందుకు గడువును ఈనెల 30 వరకు పొడిగించినట్లు చెప్పారు. బుధవారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామ, పట్టణాల్లో డిపట్టా స్థలాల్లో ఎవరైనా ఆక్రమించి ఇళ్లు కట్టుకుంటే 150 గజాల వరకు వారికి క్రమబద్ధీకరణ చేయవచ్చని చెప్పారు. రాన్ను ఎన్నికలకు ఓటర్ లిస్టులు తయారు చేసి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ సబ్బారావు, ఆర్‌ఐ రాంకుమార్, ఈడీటీ గౌరిశంకర్ పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. రోడ్డు వేశారు

● హర్షం వ్యక్తంచేస్తున్న బొబ్బిలి శివాలయం వీధివాసులు


హర్షం వ్యక్తం చేస్తున్న బొబ్బిలి శివాలయం వీధి వాసులు

బొబ్బిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోగల ఎనిమిదో వార్డులో శివాలయం వీధి జయప్రకాశ్ మునిసిపల్ స్కూల్ రోడ్డును ఎట్టకేలకు అభివృద్ధి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో గత ఏడాది ఆగస్టు ఒకటో తేదీన సైకిల్‌పై వస్తున్న ఓ బాలుడులారీ కిందపడి మృతిచెందిన విషయం విదితమే. అప్పట్లో స్థానికులు ధర్నాకు దిగారు.ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే బేబీనా యన రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం మునిసిపల్ అధికారులు సీసీ రోడ్డును నిర్మించడంతో వార్డుకు చెందిన పితాని శ్రీని వాసరావు, మురళి, నరసింహమూర్తి, ఎల్లేశ్వరరావు, గౌరి, రాణి సంతోషం వ్యక్తంచేశారు.

నీటి సరఫరాను పర్యవేక్షించాలి

● మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి


మాట్లాడుతున్న రామలక్ష్మి

బొబ్బిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో తాగునీటిని సరఫరా చేసే సమయంలో డీఈఈ నేతృత్వంలో ఏఈ, వార్డు ఎమినిటీ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. బుధవారం బొబ్బిలి మునిసిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వాల్వ్‌ఆపరేటర్లు, పైపులైన్ ఫిట్టర్లు, ఎమినిటీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. వేసవిలో ప్రజలందరికీ సక్రమంగా తాగునీటిని సరఫరా చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి తాగునీరు సరఫరా అవుతున్నదీ లేనిదీ పర్యవేక్షించాలన్నారు. భోజరాజపురం ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు, విద్యుత్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. పైపులైను లీకేజీల ద్వారా తాగునీటి వృథాను అరికట్టాలని కోరారు. మంచినీటి కుళాయిల దగ్గర అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని కుళాయిలకు హెడ్స్ బిగించాలని ఆదేశించారు. బోర్‌వెల్స్ అందుబాటులోనికి తీసుకురావాలని కోరారు.పట్టణంలో నీటిని వృథా చేయరాదని, నీటిని వాడుకున్న వెంటనే కుళాయిల హెడ్స్‌ను మూసివేయాలని ప్రజలకు మైకుల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తపనులకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ముఖ్యమైన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈలు గుప్త, వార్డు ఎమినిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రైతులు అనుసరిస్తున్న పద్ధతుల పరిశీలన

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టవలసలో వరి, మొక్కజొన్న పండించే మెట్టవలస, గొర్లె సీతారాంపురం రైతులతో ఏరువాక కేంద్రం విజయనగరం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మణరావు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఆచరిస్తున్న విధానాలు, వారు చేసే పద్ధతులు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచనలు సలహాలకు అనుగుణంగా ఉన్నాయా లేదోనని పరిశీలించారు.రబీలో చేసిన పంట నమోదు కార్యక్రమానికి సంబంధించి ఫిజికల్ అక్నాలెడ్జ్‌మెంట్‌లు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ: విప్

గరుగుబిల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపనున్నట్లు కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో పార్టీ మండలాధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు అధ్యక్షతన మండల స్థాయి టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడు తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెర వేర్చేందుకుచర్యలు చేపడుతున్నామన్నారు. కార్యకర్తల సమస్యలను తెలుసుకుని తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు.జంఝావతి ప్రాజెక్టు పరిధిలో పూర్తిస్థాయిలో సాగునీటితో అందజేయడంతోపాటు తోటపల్లిలో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుకు చొరవ చూపిస్తామని తెలిపారు.సమావేశంలో పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తం నాయుడు, ఎం.తవిటినాయుడు, డి.సత్యనారాయణ, ఎంటీ విజయవాంకుశం, కె.భరత్‌కుమార్, డి.ధనుంజ యరావు, కురుపాం ఏఎంసీ చైర్మన్ కె.కళావతి, అంబటి రాంబాబు పాల్గొన్నారు. కాగా గరుగుబిల్లిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో లఖనాపురం గ్రామానికి చెందిన పాలవలస శ్రావణ్‌కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన రూ.80 వేలు చెక్కును ఎమ్మెల్యే అందించారు. అలాగే గ్రామాల్లో ప్రాధాన్యత పనులకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. గరుగుబిల్లిలోని బీసీ వసతి గృహం పరిధిలో నిర్మించిన ప్రహరీ ప్రారంభించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, ఏపీవో ఎం.గౌరీనాథ్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీలో250 కుటుంబాల చేరిక


టీడీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి, వెలగవలసలోని వైసీపీకి చెందిన సుమారు 250 కుటుంబాలు బుధవారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరాయి. అలజంగి టీడీపీ నేత రెడ్డి ప్రసాద్, వెలగవలస గ్రామపెద్ద వి.శ్రీరాములు ఆధ్వర్యంలో వారంతా పార్టీలు చేరగా, బేబీనాయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. నియోజకవర్గంలో బేబీనాయన ఎమ్మెల్యే హోదాలో, వ్యక్తిగతంగా చేస్తున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాలను చూసి తామంతా ఆయన నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. సత్తరపు సత్యనారాయణ, రేజేటి ఏసు, చిట్టి, మోహన్, యజ్జల అప్పారావు, రేజేటి అప్పారావు, పెంకి వేణుగోపాలనాయుడు తదితర కుటుంబాలు పార్టీలో చేరాయి.

కూ'సంత' కరుణ లేదా?

(ఐదో పేజీ తరువాయి)

సంతకు అడ్డులేకుండా పోయింది. గత ప్రభుత్వ అనుమతులతో నడిచిన ఈ సంత ఏడాది కాలంగా ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా నడుస్తోంది. ఈ సంతకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్దఎత్తున పశువులను తీసుకొస్తారు. ఇక్కడకు ఆరోగ్యంగా వున్న పశువులకంటే అనారోగ్యంతో ఉండేవి.. గొడ్డుపోయినవి తెచ్చి కబేళా నిర్వాహకులకు తక్కువ ధరకు అమ్మేస్తారు. వీటిని కబేళా నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నారు.

వాయిదాలు ఎందుకో?

పశువుల సంతకు లైసెన్స్ ఇచ్చేందుకు ముందు సంత నిర్వహణ కమిటీ సమావేశమవ్వాలి. అదేం విచిత్రమో కానీ గడిచిన ఏడాదిలో సుమారు ఐదునుంచి ఏడు సార్లు దీని అనుమతులు పునరుద్ధరించేందుకు సంత నిర్వహణ కమిటీ సమావేశం అయింది. అయితే ఎప్పుడూ తహసీల్దార్, పశువైద్యాధికారి మాత్రమే రావడం.. పోలీస్, మార్కెటింగ్, రవాణాశాఖ అధికారులు గైర్హాజరవ్వడంతో సమావేశం వాయిదా పడేది. ఈ తంతు నిరంతర ప్రక్రియగా మారింది. సంతకు అనుమతులు ఇస్తే ఏ సమస్య వచ్చినా స్పందించాల్సి వస్తుందనో.. మరే ఇతర కారణం చేతనో అనుమతి పునరుద్ధరణ జరగడం లేదు. సంత నిర్వహణకు ఆసక్తి చూపే ఇతరులు సమావేశానికి వచ్చినప్పుడల్లా అధికారుల తీరుపై నిరాశ వ్యక్తం చేయడం సర్వసాధారణంగా మారింది. వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పినా అధికారులు మౌనాన్ని వీడడం లేదు. కాగా సంత నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి మౌనికను వివరణ కోరగా ఆ విషయం తనకు పెద్దగా తెలియదని, తాను ఇటీవలే చార్జ్ తీసుకున్నానని చెప్పారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తానన్నారు.

వచ్చే నెల సమావేశం ఏర్పాటు చేస్తాం..

లోట్లపల్లి సంత నిర్వహణకు అనుమతి ఇచ్చేందుకు ఈ నెలలో సంత కమిటీ సమావేశం నిర్వహిస్తాం. సంత ఉంటే పంచాయతీకి ప్రతి ఏడాది రూ.లక్షా 80వేలు ఆదాయం వస్తుంది. గత ఏడాది అనుమతులు లేకపోవడం వల్ల ఆదాయం కోల్పోయాం. ఈయేడాది మాత్రం ఖచ్చితంగా డబ్బులు వసూలుచేస్తాం.

-ఉమ, ఈవోపీఆర్‌డీ

బడికి రండి.. బహుమతి తీసుకోండి

(5వ పేజీ తరువాయి)

సహాయకుడు, మహిళా సంరక్షణ కార్యదర్శి, తల్లిదండ్రుల కమిటీకి చెందిన ఇద్దరు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలోని స్టాక్‌పాయింట్ నుంచి కమిటీ సభ్యులు కిట్లను తీసుకువచ్చి విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేయాల్సి ఉంటుంది.

మండల స్థాయిలో..

మండల స్థాయి కమిటీకి ఎంఈవో-2 అధ్యక్షుడిగా ఉంటారు. ఎంఈవో-1, మండల ఇంజనీర్, ఎంఐఎస్ సమన్వయకర్త, సీఎంఆర్‌టీలు సభ్యులుగా ఉంటారు. మండలస్థాయి కమిటీ తొలుత స్టాక్‌పాయింట్ నుంచి కిట్లు సేకరించి వీటిని గ్రామస్థాయి కమిటీలకు అందజేయాల్సి ఉంటుంది. పాఠశాలలు తెరిచిన రోజు నుంచి విద్యార్థుల వేలిముద్రలు సేకరించి వీటిని అందజేయాలి. ఈమేరకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లాస్థాయి కమిటీకి నివేదించాలి.

జిల్లా స్థాయిలో..

జిల్లాస్థాయి కమిటీలో సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ ఏపీసీ అధ్యక్షుడిగా, కన్వీనర్‌గా సీఎంవో, సభ్యులుగా జీసీడీవో, ఎంఐఎస్ సమన్వయకర్త ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లను స్టోరేజీ పాయింట్లకు తరలించి జిల్లావ్యాప్తంగా పంపిణీకి సంబంధించిన సమాచారాన్ని రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించాలి.

సమాచారం రావాల్సి ఉంది

ప్రభుత్వం అప్పగించిన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తిస్తాం. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభించే నాటికి ఆదేశాలు రావొచ్చు. కిట్లు పంపిణీ విషయంపై జిల్లా విద్యాశాఖకు ఎలాంటి సమాచారం లేదు. సమయం ఉన్నందున త్వరలో వచ్చే అవకాశాలు లేకపోలేదు.

మాణిక్యం నాయుడు, డీఈవో, విజయనగరం

కీలక పరిణామం

(5వ పేజీ తరువాయి)

కౌన్సిలర్లు ప్రత్యేక రహస్య శిబిరంలో పట్టణానికి దూరంగా ఉన్నారు. రహస్య శిబిరానికి వెళ్లే ముందు టీడీపీ నేత, మాజీ మంత్రి ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు నివాసానికి వెళ్లి ఆయనను కలుసుకొని, మంతనాలు జరిపిన తరువాత రహస్య శిబిరానికి తరలివెళ్లినట్లు తెలిసింది.

● చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గిన తరువాత టీడీపీ అభ్యర్థి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలన్న డిమాండ్ రెండు పార్టీల్లో గట్టిగా వినిపిస్తోంది. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు రెండింటిపైనా అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వైస్ చైర్మన్‌పై ప్రస్తుతానికి ఎటువంటి అవిశ్వాసం నోటీసు ఇవ్వలేదు. వైస్‌చైర్మన్ పదవిపై టీడీపీ, వైసీపీలకు చెందిన కౌన్సిలర్లు ఆశలు పెట్టుకొని తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చైర్మన్ పదవి వచ్చేలా సహకరిస్తున్నందున వైస్ చైర్మన్ పదవిని వైసీపీ నుంచి ఎన్నికైన కౌన్సిలర్లకు ఇవ్వాలని రెండు పార్టీల శిబిరాల్లో చర్చించుకుంటున్నారు.

సదరం ధ్రువపత్రాలకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించింది. లబ్ధిదారుల అంగవైకల్య శాతంపై ఖచ్చితత్వం కోసం వైద్య బృందాలనూ రంగంలోకి దింపింది. అన్ని జిల్లాలో వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇది పూర్తయ్యాకే అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వైకల్యాన్ని నిర్ధారించే సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే దివ్యాంగ సంఘాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు వెరిఫికేషన్ కొనసాగిస్తూనే సదరం స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ నెల 4 నుంచి సదరం బుకింగ్‌లు పునఃప్రారంభమవుతాయి. జిల్లాలోని జీజీహెచ్‌లు, ఏరియా ఆస్పత్రులు, బోధన ఆస్పత్రుల్లో ప్రతి మంగళవారం ఇవి అందుబాటులో ఉంటాయి. ఈమేరకు సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ నిర్ణయంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

● సదరం స్లాట్ బుకింగ్ పునఃప్రారంభంపై డీసీహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మిని వివరణ కోరగా ఈ నెల 1 నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉందన్నారు. పింఛన్ల పంపిణీ తదితర కారణాల వల్ల కార్యక్రమం వాయిద పడిందని, ఈ నెల 4 నుంచి సదరం స్లాట్ పునరుద్ధరణ ఉంటుందన్నారు.

కేసుల పురోగతిని నిక్షిప్తం చేయాలి

(5వ పేజీ తరువాయి)

తొలగించేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ, పోలీసు స్టేషన్ల పరిధిలో ఏదైనా నేరం జరిగితే సంఘటన స్థలానికి తక్కువ సమయంలో చేరుకోవాలని, నేరం జరిగే స్థలాన్ని డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు తనిఖీ చేసి, సాంకేతిక ఆధారాలను స్వీకరించాలని ఆదేశించారు. శిక్షలు పడిన వ్యక్తుల ప్రవర్తనపైనా నిఘా పెట్టాలని, వారిపై హిస్టరీ షీట్లు ప్రారంభించాలని అన్నారు. గంజాయి నియంత్రణలో భాగంగా వినియోగం, విక్రయం, అమ్మకాలు చేసే వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యరెడ్డి, రాఘవులు, వీరకుమార్, న్యాయసలహాదారు పరుశురాంతో పాటు, సీఐలు, ఎస్‌ఐలు ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 200 కోట్లతో అభివృద్ధి పనులు

● గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామానికి రహదారి నిర్మించి, డోలీ మోతలు లేకుండా చేయడమే ప్రభుత్వం ధ్యేయమని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో రూ. 200 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. బుధవారం మండలంలోని కొండమోసూరు జంక్షన్ నుంచి కోదవలస వరకు ఉపాధి హామీ పథకం కింద రూ. 1.25 కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డును ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 940 అంగన్‌వాడీ పోస్టులకు గాను జిల్లాలో 53 పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. గిరిజన గ్రామాల్లో 250 మంది నివాసమున్న చోట ఒక డీలర్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు గిరిజనుల నుంచి వీఆర్వోలు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, విచారణ నిర్వహించి రుజువైతే అటువంటి వారిని సస్పెండ్ చేయాలని తహసీల్దార్ డి.రవికి ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, గూడేపు యుగంధర్, నాయకులు పూసర్ల నరసింగరావు, చల్లా కనకబాబు, కొత్తల పోలినాయుడు, పల్లేడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

మండలంలోని గురువునాయుడుపేటలో బుధవారం మహిళలు తాగునీటి కోసం సీపీఎం నాయకులు కోరాడ ఈశ్వ రరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆ సమయంలో అటుగా వెళ్లిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి తమ సమస్యను వివరిం చారు. దీంతో తాగునీటి సమస్య ఎక్కడా ఉండకూడదని, అవస రమైతే బోరు తీయించి ట్యాంకు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. సాగునీరు నిమిత్తం ఏజెన్సీ గ్రామాల్లో చెరువులు నిర్మించాలని గిరిజన నాయకులు వి నతిపత్రం అందజేశారు. అవసరమైన చోట చెరువుల నిర్మాణా నికి పరిశీలించాలని ఎంపీడీవో బీవీజే పాత్రోకి మంత్రి ఆదేశించారు. ●పార్వతీపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండల టీడీపీ అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు విశాఖపట్నంలో చికిత్స పొందుతుండడంతో మంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం అక్కడి వెళ్లి పరామర్శించారు. ఆమెతోపాటు ముఖి సూర్యనారాయణ, యుగంధర్, కనకబాబు, సత్యనారాయణ, సాంబ ఉన్నారు.

మౌలిక వసతులకు నిధులు

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.బుధవారం మండలంలోని వెంకంపేట పంచాయతీ పరిధిలోని టీడీపీకార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలతో పాటు పలువురు ఉపాధి తదితర సమస్యలపై వినతి పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి సమస్యలునైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వకాలంలో నియోజకవర్గంలో అభివృద్ధిపడకేసిందన్నారు.

హామీలు అమలుచేయాలి

బెలగాం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో మునిసిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం పార్వతీపురంలోని కలెక్టరేట్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో సేవలు అందజేస్తున్న కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని డిమాండ్ చేశారు. వారికి రిటైర్మెంట్ తర్వాత ఇచ్చే సదుపాయాలను కార్మికులకు కల్పించాలని డిమాండ్ చేశారు.

రీసర్వే వివరాలు నమోదు చేయండి

వీరఘట్టం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రీసర్వే సభలు, సదస్సుల్లో వచ్చిన ఫిర్యా దులను పరిష్కరించి రీసర్వే వివరాలను రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం వీరఘట్టం తహసీ ల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, రీసర్వే డిప్యూటీ తహసీ ల్దార్ ప్రసాదరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపు ఆధార్ శిబిరం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం, గోపాలరాయుడుపేట గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. జగన్నాథపురంలో చింతాడ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్, గోపాలరాయుడుపేటలో సీహెచ్ బొడ్డవలస సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు స్పీకర్ రాక

రామభద్రపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూసాయవలస గ్రామానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం రానున్నారు. గ్రామంలో జరిగే ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారని ఇక్కడి అధికారులకు సమాచారం అందింది.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌కు కాపుశంభం విద్యార్థులు

గరివిడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుశంభం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాలబాలికల రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం కొండవెలగాడలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు జరిగాయి. ఇందులో ఎంపికైన కాపుశంభం విద్యార్థులు ఈనెల 4 నుంచి 6 వరకు రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి బాలబాలికల రెజ్లింగ్ పోటీలకు విజయనగరం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరి ఎంపికపై హెచ్ఎం డి.రాము, సర్పంచ్ లెంక సుశీలమ్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.ఉదయ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ పిన్నింటి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు టొంపల సంజీవి విద్యార్థులను అభినందించారు.

సభ్యత్వ కార్డుల పంపిణీ

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం పాలన సాగుతోందని టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుధారాజు తెలిపారు. బుధ వారం మండలంలోని అమ్మపాలెంలో టీడీపీ కార్యకర్తలకు పార్టీ సభ్యత్వకార్డులు, బీమా కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మట్లాడుతూ చంద్రబాబు హయాంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరుగుతోందన్నారు. రానున్న నాలుగేళ్లలో కచ్చితంగా పేదరికం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అప్పారావు, నాయకులు శ్రీనివాసరాజు, మురళీరాజు, అప్పారావు పాల్గొన్నారు.

బాధితులకు విరాళం

నెల్లిమర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బుధ వారం లెప్రసీ బాధితులకు రూ.9,905 విరాళాలు సేకరించారు. బుధవారం లెప్రసీ సొసైటీ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు ఆ మొత్తాన్ని హెచ్ఎం జి.ఎం.శారద అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వ్యాధిగ్రస్థులకు సహాయ సహకారాలు అందించడానికి దాతలు ముందుకు రావాలన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఇన్‌చార్జి ఎంపీడీవోగా జి.రమేష్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న రమణమూర్తి నుంచి బాధ్యతలు స్వీకరించారు. రమేష్ కురుపాంలో ఈవోపీఆర్డీగా బాధ్య తలు నిర్వహిస్తున్నారు. ఆయనకు పార్వతీపురం ఎంపీడీవోగా పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ ఆదేశాలు జారీ కావడంతో బుధ వారం విధుల్లో చేరారు.